ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025







## ఎన్‌జిఒలకు అవగాహన

**ప్రజాశక్తి-నెల్లూరు**: కలెక్టర్ ఆదేశానుసారం శుక్రవారం ఎల్‌సిడిసి కార్యక్రమం పై ఎన్‌జిఒలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా వైద్య శాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత అధ్యక్షత వహించారు. జిల్లాలో కుష్టి వ్యాధి నివారణపై పనిచేస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థల పాల్గొని తమ వంతు కార్యక్రమం నిర్వహించాలని సూచనలు చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో డిఎపిటివి అనే స్వచ్ఛంద సంస్థ కుష్టి వ్యాధి నివారణ పై తాము చేస్తున్నటువంటి కార్యక్రమాలను వివరించారు. జిల్లా కుష్టు, టిబి అధికారి డాక్టర్ ఖాదరవల్లి మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు చేయాల్సిన పనులు గురించి తెలియజేశారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరుగు ఎల్‌సిడిసి కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల పాత్రను వారు చేయాల్సిన విధులను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్రబాబు, నరసింహులు ప్రసాద్ ఆచారి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుజాత

# ప్రతి పల్లే కదలాలి.. ఎర్రజెండా పట్టాలి..!

**భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం) రాష్ట్ర 27వ మహాసభలకు నెల్లూరు నగరం సిద్ధమవుతోంది.. ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో సీతారాం ఏచూరి (అనిల్ గార్డెన్) నెల్లూరు నగరంలో నిర్వహించనున్నారు..రాష్ట్ర నలుమూల నుంచి 550 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు.. 3వ తేదీ భారీ ర్యాలీ, రెడ్ షర్ట్ వలంటీర్లు, కవాతు, విఆర్‌సి మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు.. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్.. ఎంఎ బేబి, బివి రాఘవులు హాజరు కాను న్నారు.. 27,28, 29 తేదీల్లో మూడ్రో జులు సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించ నున్నా రు..ఊరు, వాడ..పల్లె..పట్టణాల్లో ఎర్ర జెండా రెపరెపలాడేలా ప్రచా రం నిర్వహించాలని,.. ఇంటికో మని షి...ఊరుకో వాహ నం... నెల్లూరుకు రండి...అనే నినా దంతో కదలిరావాలని ఆపార్టీ నాయకులు పిలుపు నిచ్చారు. 47 సంవత్సరాల తర్వాత నెల్లూరులో జరుగుతోన్న సిపిఎం సభలు చరిత్రలో నిచిలి పోయేలా నిర్వహిం చాలని ఆపార్టీ నిర్ణయిం చింది..**

- ◆రాష్ట్ర మహాసభలకు అద్భుత ఆతిథ్యం ఇవ్వాలి
- ◆ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో సిపిఎం రాష్ట్ర మహాసభలు
- ◆3నభారీబహిరంగ సభ.. బృందాకరత్ హాజరు




ప్లీనంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

సిపిఎం రాష్ట్ర మహాసభలకు ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయత్త మవుతున్నారు. 1978లో దక్షణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య నేతృత్వంలో సిపిఎం సభలకు నెల్లూరు నగరం ఆదిత్యం ఇచ్చింది... స్థానిక వైఎంసి గ్రౌండ్‌లో చలువ పందిళ్ల కింద ఉత్సాహ పూరిత వాతావరణంలో సభలు నిర్వహించారు. యువకులుగా ఉన్న జక్కా వెంకయ్య దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. సుమారు 47 సంవత్స రాల తర్వాత మళ్లీ ఇప్పుడు నెల్లూ రు నగరంలో ఎంతో ప్రతి ష్టాత్మకమైన సిపిఎం రాష్ట్ర 27వ మహాసభలకు నెల్లూరు నగరం ఆదిత్యం ఇస్తుంది. ప్రతి మూడేళ్లకోసారి జరిగే మహాసభలకు రాష్ట్ర నలు మూలల నుంచి సుమారు 550 మంది ప్రతినిధులు, పరిశీలకులు హాజరు కానున్నారు. ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో మాగుంట లేవుట్‌లోని అనిల్ గార్డెన్‌లో ప్రతినిధుల సభ నిర్వహించ నున్నారు. 1 వతేదీ ఉదయం 9 గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. మూడేళ్ల కాలంలో జరిగిన పార్టీ ఉద్యమాలు, సమీక్షించు కుంటారు. భవిష్యత్తు ఉద్యమాలకు రూపకల్పన చేస్తారు.. మూడ్రోజులు ఘనంగా నిర్వహిం చనున్న ఆపార్టీ మహాసభలకు ఆదిత్యం ఇవ్వడానికి భారీ ఏర్పాట్లు చేస్తు న్నారు. నగరం ఎరుపుమయం చేసేలా ప్రచార తోరణాలు, హోర్డి ంగ్‌లు, ఫ్లెక్సీలు, ఏర్పాటు చేయ నున్నారు. మహాస భలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆపార్టీ నాయకులు నిర్ణయించారు..

**మూడ్రోజులు సాంస్కృతిక ఉత్సవాలు..!**

సిపిఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా మూడ్రోజులు సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించ నున్నారు. ఈనెల 27,28,29 తేదీల్లో నగరంలోని ముత్తుకూరు గేట్ వద్ద ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. వివిధ కళారూపాలు ప్రదర్శనతోపాటు, సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ప్రముఖ అభ్యుదయ రచయిత గోరంట్ల వెంకన్న, ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్‌తోపాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ప్రతి రోజూ సాయంత్రం ఈ ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు..

**3న భారీ ర్యాలీ..బహిరంగసభ..!**

సిపిఎం రాష్ట్ర మహాసభల ముగింపు సందర్భంగా నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభలు నిర్వహించ నున్నారు. 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహిస్తారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ రకాల కళారూపాలతోపాటు, రెడ్ షర్ట్ వలంటీర్లు, కవాతు, ప్రత్యేక ఆక ర్షణ కానుంది. అడుగడుగునా ర్యాలీని స్వాగతాలు ఏర్పాటు చేస్తు న్నారు. విఆర్‌సి మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథు లుగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్...ఎంఎ బేబి..బివి రాఘవులతో పాటు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు హాజరు కానున్నారు.

**ప్రతి పల్లే కదలాలి..ఎర్రజెండా పట్టాలి..!**

రాష్ట్రంలోనే ఎంతో ఉద్యమ చరిత్ర ఉన్న నెల్లూరులో జరుగుతోన్న సిపిఎం రాష్ట్ర మహా సభలను చరిత్రలో నిలిచి పోయేలా నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆపార్టీ విస్తృత జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుచ్చ పల్లి సుందరయ్య సొంత గడ్డ నెల్లూ రులో జరుగుతోన్న ఈ సభలపై అందరి దృష్టి ఉందన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక రాజకీయ పరిస్థితులున్న నేపథ్యంలో జరుగుతోన్న ఈ సభలు భవిష్యత్తు ఉద్యమాలకు మరింత ఉత్సాహం నింపేలా సాగాలన్నారు. ప్రతి పల్లే కదలాలి. ఎర్రజెండా పట్టా లన్నారు. ఆతిథ్యానికి నెల్లూరుకు ప్రత్యేకత ఉందని దానిని నింపుకోవాలన్నారు. మహాసభల దృష్ట్యా ప్రతి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయా లన్నారు. కుటుంబాలతో కలిసి ప్రతి నాయకులు ర్యాలీ, బహిరంగ సభకు హాజరుకావాలని కోరారు. మూడ్రోజులు పాటు జరిగే సాంస్కృతిక కార్యక్ర మాలను విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ పాల్గొన్నారు.



## క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-కందుకూరు**

కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ , డైరీని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఉపాధ్యాయ నియామకాలు, ఉపాధ్యాయ వర్గానికి పెద్ద ఎత్తున మేలు చేసింది తెలుగుదేశం ప్రభుత్వం ఒక్కటేనని తెలిపారు.కార్యక్రమంలో టిఎన్‌యుఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెరుకూరి పూర్ణచంద్రరావు ,తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం సీనియర్ నాయకులు తల్లపనేని శ్రీనివాసరావు, ఉన్నం వెంకట్రావు, ఆర్ శంకర్, సోమినేని రవీంద్రబాబు, కె.వెంకటేశ్వర్లు, ఏలూరి బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన తాబేళ్లు మృత్యువాత

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు** :అత్యంత అరుదైన, విలువ కలిగిన తాబేళ్లు మత్యు వాత పడుతుండడం పర్యావరణ ప్రేమికులు కలవర పెడుతోంది. వివరాల్లోకి వెళితే, మండలంలోని కొత్త కోడూరు సముద్రతీరానికి అరుదైన ఆలీవ్ రెడ్లీ తాబేళ్ల మృత కళేబరాలు కొట్టుకొచ్చాయి. రెండు మూ డు రోజుల నుంచి ఈ తాబేళ్ల ఒడ్డు కు కొట్టుకుని వస్తున్నాయి. ప్రస్తుతం గుడ్లుపెట్టే సీజన్ కావడంతో తా బేళ్ల సముద్ర తీరానికి వస్తుంటాయని స్థానిక మత్స్య కారులు చెబుతున్నారు. మూడ్రోజులుగా సాగరతీరం ఒడ్డున పదుల సంఖ్యలో మృతి చెంది న తాబేళ్లు కనిపిస్తున్నాయి. అంతరించి పోతున్న జాబితాలో ఉన్న ఈ తాబేళ్లు కోడూరు సముద్రతీరం వెంబడి పదుల సంఖ్యలో చనిపోతుండడం పర్యావరణ ప్రేమికు లను కలవర పెడుతోంది. గుడ్లు పెట్టేందుకు తీరానికి వ స్తున్న అరుదైన ఈ జీవులు జాలర్ల వలలకు చిక్కుకొని, మరపడ వల పంకాలు తగిలి అధిక శాతం మృత్యువా త పడుతున్నట్లు స్థాని కులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ కారణాలతో అంతరించి పోతున్న అరుదైన ఆలీవ్ రెడ్లీ తాబేళ్లను సంరక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

# అనుమతిలేని నిర్మాణాలకు నోటీసులు జారీ



నిర్మాణాలను పరిశీలిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-నెల్లూరు**: నగరపాలక సంస్థ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు అదనపు అంత స్తులు ఇతర కట్టుబడులను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ సూర్య తేజ పట్టణ ప్రణాళిక విభాగం అధికారు లను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక ఆత్మకూరు బస్టాండు, జేమ్స్ గార్డెన్, రామ్మూర్తి నగర్, రామలింగాపురం తదితర ప్రాంతాలలో కమిషనర్ శుక్రవారం పర్యటించారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని శానిటైజేషన్ విభాగం అధికారులు సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ 100శాతం జరపాలని, గార్బేజ్ పాయింట్లు, ఫ్లోర్ పాయింట్లు లేకుండా ప్రతి వీధిని పర్యవేక్షిం చాలని ఆదేశించారు. భూగర్భ డ్రెయినేజీ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ తమ ఇంటి డ్రెయిన్ కు అనుసంధానం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రోడ్ల వెంబడి డంప్ చేసి ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేలా విద్యుత్ శాఖ వారికి తెలియజ ేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనధికార ఫ్లెక్సీలు, అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక రామలింగాపురం కూడలిలోని అన్నా క్యాంటీన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంటీన్లో ప్రజలకు అందుతున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్ర మంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ రామ్ మోహన్ రావు, ఈ.ఈ. రహంతు జానీ, హార్టికల్చర్ ఏ.డి. ప్రదీప్ కుమార్, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ ప్రకాష్ బాబు, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ క్యాంపు నిర్వహణ అభినందనీయం

**ప్రజాశక్తి-నెల్లూరు**: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏటి పండుగ సందర్భంగా వెంకటేశ్వరపురం, పెన్నానది తీరంలో, నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో బ్లాక్ బోర్డ్ మిత్రమండలి అధ్యక్షులు నరసాపురం ప్రసాద్ అధ్యక్షతన మెడికల్ క్యాంపు నిర్వహించారు. అక్కడికి విచ్చేసిన భక్తులకు ప్రథమ చికిత్స నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని సందర్శించిన కోవూరు సిఐ సుధాకర్ రెడ్డి బీ.పీ చూపించుకొని మాట్లాడుతూ పండుగలు, జాతరలు, తిరునాళ్ల సందర్భంగా పీ.హెచ్.పీలు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అభినందనీయమన్నారు. వైద్య శిబిరాలను భక్తులందరూ సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ శిబిరంలో ఉచితంగా మందులు అందజేసిన నరసాపురం ప్రసాద్ ను ప్రత్యేకంగా అభినం దించారు. కార్యక్ర మంలో వేణుగోపాల్, శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, భాస్కర్, రేష్మ, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



## 'నేడు స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛత దివస్'


**ప్రజాశక్తి -నెల్లూరు** :ప్రతినెలా మూడవ శనివారం జిల్లా అంతా స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛత దివస్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి స్వచ్ఛతా కార్యక్రమాలపై చేపట్టాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. స్వచ్ఛత కార్యక్రమాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతిస్తుందని ప్రతి మూడవ శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛత దివస్ కార్యక్రమాలలో ప్రజలు ఎక్కువగా భాగస్వాములయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. గ్రామాలలో ,పట్టణాలలో వీధులను, డ్రెయినేజీలను, తాగునీటి వనరులను, ఓహెచ్‌ఎస్‌ఆర్లను శు భ్రపరచడం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే మంజూరు చేసిన సోక్ పిట్లపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గ్రౌండ్ అయ్యేవిధంగా చూడాలని డ్వామా అధికారులకు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు కూడా పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలపై ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయాలన్నారు.

**ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్**

స్వచ్ఛ ఆంధ్ర దివాస్ క్యాంపెయిన్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతినెలా మూడవ శనివారం నిర్వహించడం జరుగుతుంది. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానంగా పారిశుధ్యం పై ప్రజలలో అవగాహన పెంచడం సమాజంలో పరిశుభ్రతా ప్రమాణాలను పెంపొందించడం. పరిసరాల పరిశుభ్రతపైన బహిరంగ ప్రదేశాలలోను, ఆవాస ప్రాంతాలలోనూ పాఠశాలలు ఆసుపత్రులు తదితర ప్రాంతాలను శుభ్రంగా ఉంచడంపై ప్రజలకు అవగాహన కల్పించటం, మురుగు నీటి నిర్వహణ,ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు వంటి పారిశుద్ధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, స్వచ్ఛభారత్ మిషన్‌కు రాష్ట్ర స్థాయిలో అందించిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించాలన్నారు.ప్రతి మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి అవగాహనకు తీసుకొని రావడం జరుగుతుంది


## అనధికార బ్యారెన్ నిర్మాణాలపై చర్యలు

**ప్రజాశక్తి-కందుకూరు**: వేలం కేంద్రం నెం.26 వేలం నిర్వహణాధికారి ఎం.కిరణ్ ఆధ్వర్యంలో అనధికార బ్యారన్ నిర్మాణాలపై చర్యలు చేపట్టారు .వేలం కేంద్రం పరిధిలో గల మండలాలైన పొన్నలూరు,కందుకూరు, జరుగుమల్లి,సింగరాయకొండ మండల తహశీల్దార్ ఆఫీసులను సందర్శించి 2024-25 సంవత్సర కాలంలో పొగాకు రైతులు చేపట్టిన అనధికార బ్యారన్ల జాబితాను తహశీల్దార్లకు పంచాయతీ సెక్రటరీ / విఆర్ఒ లకు సమర్పించి పొగాకు బోర్డు వారు అనధికారిక బ్యారన్ నిర్మాణాలపై చేపడుతున్న చర్యలను వివరించారు. పొగాకు బోర్డ్ వారు అట్టి నిర్మాణాలను నిలువరించేందుకు జారీచేసిన నోటీసును, మహజరునామా కాపీలను అందజేసి రాష్ట్ర ప్రభుత్వ నియమావళిని అనుసరించి అక్రమ బ్యారన్ నిర్మాణాలను నిలువరించే దిశగా తగు చర్యలు చేపట్టాలని వారికి సూచించారు.



## ఎరువుల దుకాణాల్లో తనిఖీ

**ప్రజాశక్తి-కందుకూరు**:పట్టణ పరిధిలోని అన్ని ప్రయివేటు ఎరువులు, షాపులను మండల వ్యవసాయాధికారి వి.రాము ఆధ్వర్యంలో నెల్లూరు భూసార పరీక్ష సహాయ వ్యవసాయ సంచాలకులు కె. కన్నయ్య కందుకూరు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు.వారి దగ్గర నిల్వ ఉన్న యూరియా, డి ఎ పి ఇతర ఎరువులు ఈ పాస్ మిషన్ లోని స్టాక్ గోడౌన్ లోని స్టాక్ ను పరిశీలించి,రైతులకు బిల్లులు సక్రమంగా ఇస్తున్నారా లేదా అని పరిశీలించారు. పురుగు మందుల డీలర్ల లైసెన్సు , కంపెనీ ఉత్పత్తి చేసే పి సి ఫారం లను పరిశీలించారు.రైతులు పైన తెలియజేసిన వివరాల ప్రకారం రైతులు గమనించి రాత పూర్వకంగా మీ మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేసి,తగు సూచనలు సలహాలు పొందవచ్చని తెలియజేశారు



తనిఖీలు చేస్తున్న అధికారి

## టిఆర్ఆర్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

**ప్రజాశక్తి-కందుకూరు** : లోని టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2007-09 విద్యా సంవత్సరంలో కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థినీ, విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని దృఢ సంకల్పంతో ముందుకు నడిపిన రథసారథులు బాలాజీ, సుమాంజలి గౌసియా భాను నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ షేక్ నాగూర్ వలి హాజరయ్యారు. పూర్వ విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపల్ నాగూరు వలి మాట్లాడుతూ మీరందరూ కళాశాల నుంచి బయటకు వెళ్లి 16 ఏళ్లు అయిందన్నారు. మీ స్నేహితులను,కళాశాలను గుర్తుపెట్టుకుని ఇటువంటి కార్యక్రమం చేపట్టటం గర్వించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు అందరూ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయంగా పదివేల రూపాయలు ప్రిన్సిపల్‌కి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తొట్టెంపూడి సుబ్బారావు, చుండూరి బాబురావు ,కలగట్ల హజరత్తయ్య ,కాశీ రత్నం, అక్రమ్, మాధవరావు, పూర్వ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



కె సుకన్య



కె మల్లేశ్వరి



ఎన్ మాధవి



కె శ్రీవేణి

## ఎన్‌సిపి క్యాంప్‌నకు 'ప్రకాశం' విద్యార్థులు

**ప్రజాశక్తి-కందుకూరు**: గుంటూరు గ్రూప్ పరిధిలో జరగనున్న ఏపీ ట్రెక్-3 కొండవీడు క్యాంప్‌నకు ఈనెల16 నుంచి 23 వరకు జరగనున్నాయి. ఈ క్యాంపునకు ఏపీ అండ్ తెలంగాణ నుంచి 510 ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొననున్నారు. ఇందులో గుంటూరు గ్రూపు అండర్‌లో ఉన్నటువంటి ఈ 34 ఆంధ్ర బెటాలియన్ పరిధిలోని ఉన్నటువంటి 185 ఏ క్యాప్ కందుకూరు ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజ్ నుంచి, మన ప్రకాశం డిస్ట్రిక్ట్ నుంచి నలుగురు సీనియర్ వింగ్ క్యాడెట్లు ఎంపిక కావడం జరిగింది. ఆ నలుగురు ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థినిలు ఎన్.మాధవి,కే.శ్రీ వేణి,కే.మల్లేశ్వరి,సుకన్య లు ఎంపిక కావడం గర్వకారణం. ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశం గుంటూరు చారిత్రాత్మక ప్రాంతాలైన కొండవీడు మొదలగు ప్రాంతాలలో క్యాడేట్లను ట్రెక్కింగ్ కి తీసుకు వెళ్లడం జరుగుతుంది. అదే విధంగా క్యాడెట్లు ఫిజికల్ ఫిట్నెస్ అబ్జర్వ్ చేస్తారని ఇంటర్నేషనల్ మౌంట్ నీర్ షేక్ హిమామ్ షా వెల్లడించారు.ఇలాంటి క్యాంపులకు ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజ్ ఎన్సిసి విద్యార్థులు సెలెక్ట్ కావడం ఎంతో ఆనందకరంగా ఉందని కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రామయ్య , టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే.విజయ్ శ్రీనివాస్, ఎన్సిసి నిర్వాహకులు అకడమిక్ ఇన్‌ఛార్జ్ మీరావలి, సహాయక ఎన్సిసి ఇన్‌ఛార్జ్ సంతోష్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## కుష్టు నివారణపై అవగాహన

**ప్రజాశక్తి-కందుకూరు**:మండలంలోని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమం మండల వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ డి.జువేరియాభాను ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. . ఈ కార్యక్రమంలో డి పిఎం ఓ కే. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 20నుంచి ఫిబ్రవరి రెండవ తేదీ వరకు జరిగే ఇంటింటా సర్వే కార్యక్రమంలో చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులపై వీపుపై ఎదపై నొప్పిలేని బొడిపలు, కనురెప్పలు మూత పడకపోవడం, అరచేతుల్లో కాళ్లలో స్పర్శ కోల్పోవడం, తెలియకుండానే చేతులు కాళ్లలో బొబ్బులు రావడం, ఇలాంటి లక్షణాలు గల అనుమానితులను ముందుగా గుర్తించి వెంటనే సంబంధిత సూపర్వైజర్లకు తెలపాలని తెలిపారు.కార్యక్రమంలో పి.హెచ్.ఎన్ వరలక్ష్మి,హెల్త్ సూపర్వైజర్ ఎం.శ్రీనివాసరావు, ఎఎన్ఎంలు, ఎం ఎల్ హెచ్ పి లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు





మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

## పలుచోట్ల పొలం పిలుస్తోంది..

**ప్రజాశక్తి-గుడ్లూరురూరల్**: గుండ్లపాలెం, చేవూరు రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది, పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ మరియు అనుబంధ రంగాలు పొలం పిలుస్తోంది/ పొలంబడి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ ఈకార్యక్రమంలో వరి నాటిన దగ్గర నుండి పొటాకు దశ వరకు ఖరీఫ్,రబీలో వస్తుంది. పొటాకు దశలో వస్తే నష్టం ఎక్కువ. లార్వాలు ఆకుల రెండు అంచులను కలిపి గొట్టంగా చేసి ఆకుపచ్చని పదార్థాన్ని గీకి తినడం వల్ల ఆకులు తెల్లబడి తర్వాత ఎండి పోతాయి. తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులు సౌభాగ్యవతి, సుధారాణి, రఘు, రైతులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు** :వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పు కారణంగా వరికి దోమ పోటు అవకాశం ఉందని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చింతోపు గ్రామంలో వ్యవసాయాధికారి వివి శిరీష రాణి ఆధ్వర్యంలో జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివ నారాయణ, సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌కుమార్ లు దోమపోటు ఆశించిన వరి పొలాల ను పరిశీలించారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ వారు పరిశీలించిన వరి పొలంలో దోమ కొన్నిచోట్ల తక్కువగాను కొన్ని చోట్ల ఎక్కువగాను ఆశించి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

## కంపచెట్లు తొలగింపు

**ప్రజాశక్తి-గుడ్లూరురూరల్**: మండలంలోని పొట్లూరు గ్రామంలో చెరువు దగ్గర నుండి కరెంట్ సబ్ స్టేషన్ వరకు మార్గం మొత్తం జంగిల్ తో నిండి ఉండటంతో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పొట్లూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పాతర్లపల్లి శ్రీనివాసరావు షేక్ రహంతుల్లా మండల గ్రాంట్ నిధులతో రోడ్డు మార్గంలోని జంగిల్ ని తొలగించడం జరిగింది. పూర్వం ఈ రోడ్డు మార్గంలో రైతులు పండించిన పంటను మెయిన్ రోడ్డుకు తరలించుకోవడానికి సహాయకారిగా ఉండేది ఇప్పుడు జంగల్ తో ఉండటం వలన రోడ్డు పూర్తిగా పూడిపోయింది. ఈ జంగిల్‌ని బాగు చేస్తున్న కారణంగా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పొట్లూరు గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



# అన్న క్యాంటీన్ల నిర్వహణ తీరు మెరుగుపరచండి




మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

**ప్రజాశక్తి-నెల్లూరు**: నగరపాలక సంస్థ పరిధిలోని 7 అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షిస్తూ వాటి నిర్వహణ తీరును మెరుగుప రచాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్ల నోడల్ అధికారులు, క్యాంటీన్ ల నిర్వాహకులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో పాత మున్సిపల్ ఆఫీస్, తడికల బజార్ కూడలి, ఇందిరా భవన్ రోడ్డు, ఫిష్ మార్కెట్, వెంగళరావు నగర్, మద్రాసు బస్టాండ్, రామ లింగాపురం కూడలి ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి ప్రజలకు మూడు పూటలా ఆహారాన్ని అందిస్తున్నామని తెలియజేశారు. అన్న క్యాంటీన్లలో క్వాలిటీ, క్వాంటిటీలను మెరుగుపరిచి, ఆహారంలో రుచి శుచి ఉండేలా అధికారులు, సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్నా క్యాంటీన్ ల నిర్వాహకులు ప్రతీ క్యాంటీన్ లో తప్పనిసరిగా 7 మంది సిబ్బంది ఉండేలా చూసుకోవాలని, తయారీ ప్రాంతం నుంచి క్యాంటీన్ లకు సరఫరా చేసేందుకు, క్యాంటీన్లో ప్రజలకు వడ్డించేందుకు అవసరమైన మేరకు సిబ్బందిని పెంచుకోవడంతో పాటు తోపులాటలు జరగకుండా సెక్యూరిటీ ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బంది హాజరు పట్టిక, విజిటర్స్ హాజరు పట్టిక, ఫిర్యాదుల పట్టికలను ప్రతి క్యాంటీన్లో ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అన్ని క్యాంటీన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ విభాగం ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి క్యాంటీన్లో స్వచ్ఛమైన తాగునీరు కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, ఎప్పటికప్పుడు ఆహారపు ప్లేట్లను శుభ్రపరచడం, ఆహారం అందించే వేళలను రద్దీ మేరకు పెంచడం, ఎక్కువ ఆహారం అవసరమైన క్యాంటీన్ కు ఎక్కువ మొత్తంలో సరఫరా చేయడం వంటి అంశాలపై దృష్టి సారించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో నోడల్ అధికారులు చెన్నుడు, ఇనాయతుల్లా, వేణు, రహంతూ జానీ, డాక్టర్ చైతన్య, శ్రీనివాసులు, శేషగిరి రావు, క్యాంటీన్ ల నిర్వాహకులు గణేష్, అనిల్, సాయి, నిఖిల్ పాల్గొన్నారు.

# రహదారి భద్రతా వారోత్సవాలు

**ప్రజాశక్తి-నెల్లూరు** : నగరంలోని వి.ఆర్.సి సెంటర్ లో శుక్రవారం రహదారి భద్రతా వారోత్సవాలు ( ట్రాఫిక్ పై అవగాహన (వలంటరింగ్ పోలీసు) ఘనంగా మొదలైంది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సౌత్ ట్రాఫిక్ పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి , ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్, జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి, ఎస్ఐ హరి కృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ నేటి నుంచి ఈ నెల 23 వరకు ఈ భద్రత వారోత్సవాలు జరుగుతాయని, యువత ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలని ట్రాఫిక్ సమస్యలు వల్ల అనేక ఇబ్బందులు ఎదురువుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణగా వాహనాలు నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లన అనేక సమస్యలు వస్తున్నాయని తెలిపారు.అనంతరం ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ యువత హెల్మెట్ ధరించి వాహనాలు నడపటం వల్లన ప్రమాదాలు నివారించొచ్చన్నారు. మొబైల్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరం అని వీటి అన్నిటిపై ప్రజలకు మన ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు.. అనంతరం డాక్టర్ ఉదయ్ శంకర్ మాట్లాడుతూ యువత ట్రాఫిక్ నియమాలకు కట్టుబడి ఉండాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో ఎన్ వైకె వలంటీర్లు బి.సతీష్ కుమార్, కవిత, ఎన్ ఎస్ ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



## గోకులం షెడ్డుతో ప్రయోజనం

**ప్రజాశక్తి-వరికుంటపాడు**

తెలుగుదేశం ప్రభుత్వం రైతుల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న గోకులం షెడ్లు పాడి రైతులకు ఎంతో ఉపయోగకరమని టిడిపి మండల అధ్యక్షుడు చండ్ర మధుసూదన్ రావు అన్నారు. మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో రైతు గంగవరపు పద్మయ్య నిర్మించిన గోకులం షెడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.2, లక్షల 30వేలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. పాడి రైతులకు ఈ షెడ్డు వర్షాకాలం కానీ మిగతా సమయంలో కానీ ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. మండలంలో 25 గోకులం షెడ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇంకా కూడా పాడి రైతులకు ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకుంటే ఎంఎల్ఎ కాకర్ల సురేష్ సహకారంతో మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏపిఐ ఆజాంఖాన్, గ్రామ టిడిపి నాయకులు చండ్ర ప్రభాకర్ నాయుడు, గంగవరపు శివరామయ్య, గంగవరపు ప్రసాదు, శ్రీను, మధు, ప్రసాదు, శేషు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటమే గెలుపునకు నాంది..



**ప్రజాశక్తి-కావలి** : జీవితమనేది ఒక పోరాటమని, పడినప్పుడే ఎలా నిలబడాలో నేర్చుకుంటామని, ఓటమే గెలుపునకు నాంది అని ఎంఎల్ఎ దగుమటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. కె.కె.ఆర్. యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ క్రికెట్, టెన్నిస్ బాల్ టోర్నమెంట్ విజేతలకు గురువారం రాత్రి ఆయన బహుమతులను అందజేశారు. విజేతలైన టీమ్, తన పొలిటికల్ టీమ్ కలిసి సరదాగా క్రికెట్ ఆడారు. బ్యాటింగ్, బౌలింగ్ చేసి ఎంఎల్ఎ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజమని, గెలిస్తే గర్వపడటం, ఓటమి చెందితే కుంగిపోవడం చేయరాదన్నారు. మనసును ఏకాగ్రతగా ఉంచుకుంటే విజయం లభిస్తుందని తెలిపారు. కష్టాన్ని ఇష్టంగా మలచుకుంటే దేన్నైనా సాధించవచ్చని తెలిపారు. కష్టపడందే విజయం దక్కదన్నారు. జీవితంలో ఏదైనా మొదట సుఖాన్ని ఇచ్చేది చివరకు దుఃఖాన్ని మిగులుస్తుందని, అదే కష్టంతో ప్రారంభం అయితే విజయాలతో, సుఖాలతో ముగుస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరూ ఓటమి నుండి గుణపాఠం నేర్చుకొని విజయానికి నాంది పలకాలని కోరారు. టోర్నమెంట్ నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, వార్డు ఇన్‌ఛార్జి ప్రకాశంరావు మల్లికార్జున, కూటమి నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'



**ప్రజాశక్తి-ఉదయగిరి** : మండల పరిధిలోని కొండకింద పంచాయతీలోని బండగానపల్లి, గంగులవారి చెరువుపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన వరిపంటను వేసిన రైతులను ఉద్దేశించి ఈ పంట నమోదు వరి పంటల మద్దతు ధరపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఇఒ వినోద్, రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : మండల పరిధిలోని అనుమసముద్రం, ఎఎస్‌పేట బిట్-1 గ్రామాలలో మండల వ్యవసాయ అధికారిని టి.రజిని ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.దేవసేనమ్మ పాల్గొని, వరిలో ఎలుకల నివారణకు రైతులు సామూహికంగా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ కె.చిరంజీవి, వై.భాగ్యలక్ష్మి, విఎఎలు జి.రమ, కె.శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వంసిద్ధం

**ప్రజాశక్తి-ఉదయగిరి** : స్థానిక ప్రభుత్వ అల్తూరి రామిరెడ్డి హైస్కూల్‌లో శనివారం జరిగే నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వంసిద్ధం చేసినట్లు ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 264మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 11మంది ఇన్విజిలేటర్లను, చీఫ్ సూపరింటెండెంట్ అధికారులుగా వి.బాల కేశవులును, డిపార్ట్మెంటల్ అధికారిగా యమునా లక్ష్మిని ఈ ప్రవేశపరీక్షకు నియమించారని ఎంఇఒ తెలిపారు. కావున ఈ ప్రవేశ పరీక్షకు కేటాయించిన ఇన్విజిలేటర్లు ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రావాలని కోరారు.

## నేడు 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్'

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : మండల పరిధిలోని మండల అభివృద్ధి కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు ఎంపిడిఒ ప్రసన్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18వ తేదీన కడప జిల్లా మైదుకూరులో సిఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. పంచాయతీల్లో ప్రజా ప్రతినిధులను, తప్పనిసరిగా పంచాయతీ సెక్రటరీలు సమన్వయం చేసుకొని, శనివారం జరుగుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## రీసర్వేను పారదర్శకంగా చేపట్టాలి

**ప్రజాశక్తి-కోవూరు** : కోవూరు పంచాయతీ పరిధిలో చేపట్టనున్న భూముల రీసర్వేను పారదర్శకంగా ప్రభుత్వం నిర్ధేశించిన నియమ నిబంధనలకు లోబడి చేపట్టేలా సంబంధిత గ్రామ సర్వేయర్ల బృందం ప్రత్యేక దృష్టి పెట్టాలని తహశీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కోవూరుకు సంబంధించిన భూముల రీసర్వే కార్యక్రమంపై గ్రామస్థాయి సర్వేయర్ల బృందంతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేకు సంబంధించి కోవూరు పంచాయతీ పరిధిలో ఉన్న రైతులు కూడా తమవంతు పూర్తిస్థాయిలో సహకారాన్ని రీసర్వే బృందానికి అందజేయాలన్నారు. దానికి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్ రావు, డిప్యూటీ తహశీల్దార్ నాజర్, మండల సర్వేయర్ రమేష్‌గౌడ్ ఉన్నారు.



## బ్రోచర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-కావలి** : వైకుంఠపురంలోని నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ అండ్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్‌లో శుక్రవారం బిటెక్, డిగ్రీ విద్యార్థులకు సంబంధించి ఎఐసిటిఇ, ఎపిఎస్‌హెచ్ఇ వారి అనుమతితో ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం బ్రోచర్‌ను మున్సిపల్ డి.ఇ. సాయిరామ్ ఆవిష్కరించారు. విట్స్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో బ్రోచర్ ఆవిష్కరించిన డి.ఇ సాయి రామ్ మాట్లాడుతూ నేటి సాంకేతిక విద్య మారుతున్న తరుణంలో ప్రతి విద్యార్థి తమ జ్ఞానాన్ని మరింత పెంపోందించుకోవాలని సాంకేతిక పరిజ్ఞానంలో దూసుకుపోవాలన్నారు. సాంకేతిక రంగంలో ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్న నైస్ వ్యవస్థాపకులు వెంకారెడ్డికి ఈ ఇంటర్న్‌షిప్ ఇచ్చే అవకాశం లభించడం అభినందనీయమని సాయిరాం అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ సునీల్ మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ సైన్స్ సాంకేతిక రంగంలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అంశాలపై రియల్ టైం వారిచే క్లాసులు జరపాలని, అలాగే కోర్స్ పూర్తయిన తరువాత విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమానికి విచ్చేసిన విట్స్ సీనియర్ ప్రొఫెసర్ సుబ్బయ్య మాట్లాడుతూ ఇంటర్న్ షిప్ చెయ్యడానికి మహానగరాలు వెళ్లి, లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తున్న తరుణంలో కావలిలో 30 సంత్సరాలు నుంచి అనుభవం ఉన్న నైస్‌లో చేరి చేసి విలువైన డబ్బుని, సమయాన్ని ఆదా చేసుకోవాలని కోరారు. డైరెక్టర్ ఆళ్ల వెంకా రెడ్డి తనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంబంధిత విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫాకల్టీ శ్రీనాథ్, విద్యావేత్తలు పాల్గొన్నారు.

## ఫైబర్‌నెట్‌పై విజిలెన్స్ దర్యాప్తు

**ప్రజాశక్తి-కోవూరు** : మండలంలోని గంగవరం, పాటూరు, వేగూరు, కోవూరు గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసి ఉన్న ఫైబర్‌నెట్‌పై శుక్రవారం నెల్లూరు విజిలెన్స్ సిఐ శ్రీహరిరావు ఆధ్వర్యంలో విజిలెన్స్ బృందం నిశిత పరిశీలన చేపట్టారు. ప్రధానంగా దానికి సంబంధించి ఫైబర్‌నెట్ కనెక్షన్ ఇచ్చారా.. అందులో ఏయే మెటీరియల్ వాడారు.. ఏ ప్రభుత్వ కార్యాలయానికైనా దాని ద్వారా కనెక్షన్ ఇచ్చారా.. ఈ ఫైబర్‌నెట్ మిషన్లో నిర్ధేశించిన ప్రమాణాల్లో మెటీరియల్స్ వాడారా అనే విషయాలపై ఈ విజిలెన్స్ బృందం నిశిత పరిశీలన చేపట్టిందని అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో విజిలెన్స్ ఎఇ వెంకటరెడ్డి, ఎపి ఫైబర్‌నెట్ ఇంజనీర్ నవీన్, తదితరులు ఉన్నారు.

# మహిళల భవితకు 'కిశోరి వికాసం'

**- మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్**



ఆత్మకూరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు,



ఎఎస్‌పేటలో..

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

యుక్త వయస్సు బాలికలు మహిళలు ఉజ్వల భవితకు కిశోరి వికాస కార్యక్రమం ఉపయుక్తమని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కిశోరీ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ సునీలత ఆధ్వర్యంలో కిషోర్ బాలికలకు ఏ విధంగా అవగాహన కల్పించాలనే దానిపై ఆమె మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత లైంగిక దాడి, అక్రమ రవాణా, బాల్య వివాహాల వంటి తొమ్మిది అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ ఆడపిల్లల ఉజ్వలమైన ఆరోగ్యవంతమైన భవితకు కిశోరి వికాసం పున:ప్రారంభం పునాది వేస్తుందన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వరకట్న మరణాలు, బాల్య వివాహాలు, గృహహింస పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవనేలా మహిళలను చైతన్య చేయాలన్నారు. సిఐ గంగాధర్ మాట్లాడుతూ బాలికలు బాల్యం నుంచి వయసు వరకు మోసపోకుండా అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు ప్రతి సందర్భంలోనూ చర్చ పెట్టి అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ అస్మా, డాక్టర్ అనూష మాట్లాడారు. లెక్చరర్ వై.మెర్సి, పిహెచ్ఎన్ సుగుణమ్మ, హెచ్‌వి.పార్వతమ్మ, ఎంపిహెచ్ఇఒ సుధా కర్, వెలుగు ఎపిఎం కె.హరి, ఎన్‌జిఒ వాగాల శ్రీహరి, లీగల్ అడ్వకేట్ ఎన్.ప్రశాంతి, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు నారాయణ మ్మ, రత్నమ్మ, నాగేశ్వరి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట** : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎంపిపి బోయిళ్ల పద్మజరెడ్డి అధ్యక్షతన ఎంపిడిఒ ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో కిశోరీబాలిక వికాసం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రధానంగా కౌమారక దశ అందులో వచ్చే మార్పులు, రుతుస్రావం, వ్యక్తిగత పరిశుభ్రత, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ వివకత, లైంగిక వేధింపుల నుండి రక్షణ, బాల్య వివాహాలను అరికట్టుట, అక్రమ రవాణా నుండి రక్షణ పొందడానికి ఆత్మరక్షగా నైపుణ్యాలను పెంపొందించు కోవడం, సమాజంలో తన గుర్తింపును పొందడానికి తగిన నైపుణ్యం, ఉపాధి కలిగి ఉండడం అనే 9అంశాలపై కిశోర వికాసం ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిడిపిఒ పి.సునీలత, ఎంఇఒ డి.సాయి పసాద్, ఎపిఎం పి.సతీష్, ఎన్‌జిఒ వెంకటేశ్వర్లు, ఎస్‌ఒసి ప్రశాంతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జి.కస్తూరి, పి.విజయ లక్ష్మి, మండలంలోని అందరూ హెల్త్ సూపర్‌వైజర్స్, ఎఎన్ఎంలు, ఎంఎస్‌కె ఎస్‌లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీలు, వర్కర్లు పాల్గొన్నారు.

# యువజనోత్సవాలకు 'డివైఎఫ్ఐ' రూపకల్పన



బహుమతి అందజేస్తున్న బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

యువజనోత్సవాలకు రూపకల్పన చేసి నిర్వహణ ప్రారంభించింది డివైఎఫ్ఐ అని బివిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొమ్మిరెడ్డి తారక్ నాథ్ రెడ్డి పేర్కొన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా గత 5 రోజులుగా ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఏచూరి ప్రాంగణంలో జరిగిన ఆటల పోటీలకు శుక్రవారం బహుమతులు ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బివిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొమ్మిరెడ్డి తారక్‌నాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బొమ్మిరెడ్డి తారక్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గత 45ఏళ్ల నుండి నిర్విరామంగా సంక్రాంతి ఆటలపోటీలు నిర్వహించడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఆత్మకూరు సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, రెడ్‌క్రాస్ చైర్మన్ సాదిక్ హుస్సేన్, యుటిఎఫ్ నాయకులు మురళీకృష్ణ, కె.సురేష్, కె.మహబూబ్ భాషా, సీనియర్ నాయకులు పెంచలరావు, ప్రసాద్, డివైఎఫ్ఐ నాయకులు ఆక్ హజరత్తయ్య, నందా శీను, రిచర్డ్, పయాజ్, ఖాదర్ భాషా, మహేష్, రాహుల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా వి.శ్రీహరి, పి జబినబాషా, నందా శ్రీను వ్యవహరించారు. 5 రోజులు జరిగిన ఈ డివైఎఫ్ఐ క్రికెట్ పోటీలలో మొత్తం 40 టీములు పాల్గొన్నాయి. 410మంది క్రీడాకారులు, వాలీబాల్, ఫుట్‌బాల్, షటిల్, తదితర క్రీడల్లో అత్యధికంగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడలను చూసేందుకు దాదాపు 500మంది హాజరై క్రీడలను వీక్షించారు.

## ఇరుగ్రూపుల మధ్య ఘర్షణ

**ప్రజాశక్తి-లింగసముద్రం**



గతంలో స్థలం వివాదం జరిగి ఆ వివాదం కోర్టు దాకా వెళ్లి కోర్టు స్టేటస్‌కో ఉన్నప్పటికీ ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడిన సంఘటన మండలంలోని పెదవవని గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... పెదవవని గ్రామ సర్వే నంబర్ 439/1లోని గ్రామ కంఠంలో కొంత స్థలాన్ని జెడ్‌పిటిసి డాక్టర్ చెన్ను నళినీ పద్మ గతంలో ముస్లిముల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం గ్రామంలోని ముస్లిములకు తెలియడంతో వివాదం చెలరేగింది. గత సంవత్సరం ముస్లిములు ఆ స్థలం వద్దకు వెళ్లి ఈ స్థలం పీర్ల చావడిగా ఉండేదని, దానిని ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అడిగారు. ఆ సమయంలో జెడ్‌పిటిసి వారు ముస్లిం పెద్దలు తమకు అమ్మగా తాము రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని తెలిపారు. దాంతో అప్పుడు స్థల విషయం వివాదంగా మారడంతో జెడ్‌పిటిసి కుటుంబ సభ్యులు కోర్టుకు వెళ్లగా కోర్టు స్టేటస్‌కో విధించింది. మరోసారి ముస్లిములు ఆ స్థలంలోకి వెళ్లి ఇనుపకంచ వేసేందుకు జెసిబిని తీసుకువెళ్లారు. టిడిపి నాయకుడు షేక్ రఫీ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఆ స్థలం వద్దకు వందల సంఖ్యలో ముస్లిములను తీసుకొచ్చి జెసిబితో గుంతలు తీసి ఫెన్సింగ్ వేయడానికి రావడంతో జెడ్‌పిటిసి, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అక్కడకు చేరి వారించడంతో ఘర్షణ నెలకొంది. జెసిబితో గుంత తీస్తుండగా గ్రామస్తులు అడ్డుకోవడంతో జెసిబి తొండం తగిలి ఎస్ఐ మహబూబ్ సుభానితో పాటు కొందరు చతికిల పడ్డారు. దాంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొని ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వారు దాడితో జెడ్‌పిటిసి బంధువులకు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం పోలీసులు వారిని చెదరగొట్టారు. దాంతో జెడ్‌పిటిసి నళిని పద్మ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. కోర్టు పరిధిలో ఉన్న స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారులు కోర్టు ఆదేశాలను కూడా పరిగణలో తీసుకోకుండా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాదాస్పదంగా ఉన్న స్థలంలో ముస్లిములు ఫెన్సింగ్ వేశారు.

## హుండీ చోరీ

**ప్రజాశక్తి-మర్రిపాడు**

మండలంలోని పొంగూరులో పోలేరమ్మ గుడిలో ఉన్న హుండీ చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గ్రామంలో గుడివైపున వెళ్లిన గ్రామస్థులు గుడిలో హుండీ లేకపోవడంతో వెంటనే పోలీసులకు పిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు గుడి పరిసరప్రాంతాల్లో వెతుకగా ఆలయం వెనుక ఉన్న ముళ్ల పొదల్లో పడ వేసి హుండీలో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిన దృశ్యాలు సిసికెమెరాలో రికార్డు అయ్యాయి.

## 20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

మండల పరిధిలోని రైతు సోదరులకు 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పశుఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి షేక్ తాహఅన్సారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు మండలంలోని ఏదైనా రెండు గ్రామాల్లో పశుఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని, ఈ శిబిరాలలో దూడలకు, పశువులకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ చేస్తామని, పశువులకు చేసిన వ్యాధులకు టీకాలు వేస్తామన్నారు. కావున ప్రతి పశుపోషకులు ఈ పాసు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అస్గర్, మసూద్, యస్థాని, శేషారెడ్డి పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాశక్తి-లింగసముద్రం**



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరు నాగేశ్వరరావు

సంక్షేమం, అభివృద్ధి సమానంగా ప్రజలకు అందించాలనేదే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తుందని శాసనసభ్యులు ఇంటూరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని యర్రారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని ఉట్లవారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్‌ను, నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి మంచినీటి సమస్య లేకుండా చేయాలని మంచి ఆలోచనతో ఆరో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకనుండి గ్రామస్తులందరికీ మినరల్ వాటర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ముందుగా ఎంఎల్ఎను బాణాసంచాలు కాలుస్తూ, పూలు చల్లుతూ, మేళతాళాల మధ్య ఘన స్వాగతం పలికారు. రామాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు, ఎంపిడిఒ కట్ట శ్రీనివాసులు, విశ్వనాథపురం సర్పంచ్ బొలినేని నాగేశ్వరరావు, అడపా రంగయ్య, సోంపల్లి మనోహర్, నాయకులు రాజారపు మాలకొండయ్య, ఉట్లపల్లి మాధవరావు, నాయకులు పాల్గొన్నారు.

# నూతన భవన నిర్మాణాలు పరిశీలన

**ప్రజాశక్తి-ఉదయగిరి**



ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

పట్టణంలోని మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు కళాశాల ప్రాంగణాన్ని శుక్రవారం ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక డిగ్రీ కళాశాలను అభివృద్ధి పరిచే ఆలోచనలో భాగంగా భవన నిర్మాణం, మరమ్మతుల కోసం రూ.5కోట్లను కేటాయించినట్లు, అందులో భాగంగా నూతన భవన నిర్మాణం కోసం కాలేజీ ప్రాంగణాన్ని పరిశీలించామన్నారు. సంబంధిత అధికారులకు పక్కా ప్రణాళిక నమూనాను తయారు చేయాలని భవన నిర్మాణ నమూనాలో మళ్లీమళ్లీ మార్పులు చేయకుండా భవన నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. అనంతరం కళాశాల బృందం కాంట్రాక్టర్ అధికారు లను ఎంఎల్ఎకు సన్మానం చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతన బోయిన బయన్న, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకట రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్.రియాజ్, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

**ప్రజాశక్తి-కలిగిరి**



కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం అని ఎంపిపి, హెచ్‌డిఎస్ కమిటీ చైర్మన్ మెట్టుకూరు శిరీష తెలిపారు. కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం హాస్పటల్ సిబ్బంది మౌలిక సదుపాయాల విషయంపై ఎంపిపికి వివరించారు. ఆరోగ్య కేంద్రంకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని సభ్యుల సమక్షంలో తీర్మానించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వచ్చే రోగులు ఎటువంటి ఇబ్బంది పడకుండా వైద్య సేవలు మెరుగ్గా అందించాలని ఆమె కోరారు. ల్యాబోరేటరీ రూములను పరిశీలించారు. మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, ఎంపిడిఒ ప్రత్యూష, సెక్రటరీ రవిచంద్ర పాల్గొన్నారు.



## అనధికార లే అవుట్‌లపై చర్యలు

**ప్రజాశక్తి-కావలి**

కావలి పెనుశిల గ్రీన్ సిటీ లే అవుట్‌ను అక్రమలే అవుట్‌గా గుర్తించి, శుక్రవారం కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ దగ్గరుండి ఆయా ప్లాట్లలో వేసి ఉన్న రాళ్లను తొలగించారు. కావలి పట్టణం మద్దూరుపాడు, అడవిరాజు పాళెం సర్వే నెం. 208, 209, 210లలోని 19.91 ఎకరాల్లో వేసి ఉన్న లే అవుట్ హద్దురాళ్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలగించామని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా ముసునూరు టీచర్స్ కాలనీలో ఉన్న సర్వే నెంబర్ 1919లో ఉన్న 2.5 ఎకరాల అక్రమ లే అవుట్‌లోని ప్లాట్ల సరిహద్దు రాళ్లను, రోడ్లను, కాలువలను జె.సి.బి. ద్వారా తొలగించామని ఆయన తెలిపారు. సదరు లే అవుట్లలో ఎటువంటి అనుమతులు ఇవ్వబడవని తెలిపారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం మీడియా ద్వారా తెలియజేస్తున్నామన్నారు.




## డిఎస్‌పి రమేష్‌కు సత్కారం

**ప్రజాశక్తి-కావలి**

తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఎసిబి డిఎస్‌పి ఏకాంబరం రమేష్‌ను పండుగ సందర్భంగా స్వగ్రామం కావలికి వచ్చిన సందర్భంగా సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. 1983 టెన్త్ క్లాస్ బ్యాచ్ బాల్య మిత్రులందరూ డిఎస్‌పి రమేష్‌ను ఘనంగా అమరావేదగిరి సుబ్బారాయుడు గుప్తా ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో డిఎస్‌పిని సన్మానించిన వారిలో అమర వేదగిరి గుప్తాతో పాటుగా. వెంకారెడ్డి, బొగ్గవరపు శ్రీనివాసులు, టీచర్ ప్రసాద్, ఏల్చూరి వెంకటరవికుమార్, కొత్తూరు సుకుమార్, తదితరులు ఘనంగా సన్మానించారు.

## నిర్ధేశిత ప్రాంతాల్లోనే ఆటోలు ఆపాలి

**ప్రజాశక్తి-కోవూరు**



రహదారిలో ప్రయాణించే ఆటోలు తమ ఇష్టానుసారంగా ఎక్కడంటే అక్కడ రోడ్డు మధ్యలో ఆపివేసి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం మంచి పద్ధతి కాదని, దానివల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతాయని ఎస్ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు. కోవూరులోని సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం రవాణా వారోత్సవాల్లో భాగంగా కోవూరులోని అన్ని ఆటో స్టాండ్ డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్ యూనిఫారం ధరించి ఆటోకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు, లైసెన్స్ తప్పక ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా ఆటోలో పాటలు పెట్టి సౌండ్ బాక్సులతో వాతావరణం కాలుష్యం చేయవద్దని, ఆయన ఆటో డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేశారు. నిర్ధేశించిన నియమ నిబంధనలకు లోబడి ప్రతి ఆటో ప్రయాణించాలని ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లతో పాటు, పోలీసులు ఉన్నారు.

## 20న వికలాంగులకు క్యాంపు

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

మండల పరిధిలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో 20వ తేదీన కేంద్ర ప్రభుత్వ సంస్థ, సంయుక్త ప్రాంతీయ కేంద్రం నెల్లూరు వారి ఆధ్వర్యంలో వికలాంగుల, వయోవృద్ధులకు క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రసన్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్యాంపులో మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు మొదలగు ఉపకరణాలు అర్హులైన వారికి ఎంపిక చేసి ఇస్తామని తెలియజేశారు.

సదరు క్యాంపునకు వచ్చే వికలాంగులు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, యుడిఐడి కార్డు, వయోవృద్ధులు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలు తీసుకుని రావాలని తెలిపారు.



టిడిపి శాశ్వత సభ్యత్వాలు తీసుకున్న నాయకులు

## టిడిపి శాశ్వత సభ్యత్వం నమోదు

**ప్రజాశక్తి-ఉదయగిరి**

స్థానిక పట్టణంలో టిడిపి శాశ్వత సభ్యత్వాలను ఎంఎల్ఎ కాకర్ల సురేష్ చేతుల మీదుగా శుక్రవారం రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న యాదవ్ గండిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు రెడ్డిబత్తిన నరసింహారావు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కాకర్ల సురేష్ శాశ్వత సభ్యత్వాలు తీసుకున్న వారిని ప్రశంసించి మాట్లాడారు. టిడిపి ప్రజాదరణ చూసి లక్షలాదిమంది పార్టీ సభ్యత్వాలు స్వీకరించాలని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వాన్ని రాష్ట్రప్రజలు బలపరిచారని టిడిపి శాశ్వత సభ్యత్వాలు ఎక్కువమంది నాయకులు తీసుకునేందుకు చొరచూపాలని పిలుపునిచ్చారు. ఈ సభ్యత్వాలు పర్వం తెలుగు దేశం పార్టీ చరిత్రను సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## విజేతలకు బహుమతులు అందజేత

**ప్రజాశక్తి-ఎఎస్‌పేట**

మండలంలోని గుడిపాడు గ్రామంలో సిద్ధారెడ్డి అన్వేష్‌రెడ్డి మెమోరియల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో చిరమణ టీమ్ ఫైనల్లో పవన్ ఆధ్వర్యంలో జట్టు విజయం సాధించింది. విన్నర్‌గా గెలిచినందుకు గానూ రూ.20వేలను విజేతలకు అందజేశారు. రన్నర్స్ గుడిపాడు టీముకు రూ.10వేలను ఆ ఊరి గ్రామ నాయకులు జి.పుల్లయ్య, ఓ.మల్లయ్య, పి.వెంకటేశ్వర్ రెడ్డిలకు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.